రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (గురువారం సాయంత్రం)
సహర్: 4:51 (శుక్రవారం ఉదయం)

గళం విప్పిన ఎమ్మెల్యే



రైతులకు పరిహారం అందించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, మార్చి26(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మాడ్గుల మండలంలో ఈనెల 22న ఈదురు గాలులకు సుమారు 4 వేల ఎకరాలలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అదేవిధంగా ఈదురు గాలులు, వర్షాలకు మాడ్గుల మండలంలో అనేకచోట్ల కరెంట్ స్తంభాలు పడిపోయాయని, 8 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. నేటికీ కొన్నిచోట్ల స్తంభాలను పునరుద్ధరించ లేదని తెలిపారు. తలకొండపల్లి మండలంలో వర్షాలకు మహ్మద్ ఖాన్‌చెరువు, పండుగొనిచెరువుల కట్టలు, అలుగులు దెబ్బతిన్నాయని వాటికి మరమ్మతులు చేయించాలని సభ దృష్టికి తెచ్చారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగు నీరందడంలేదని పేర్కొన్నారు. కాల్వకు గండ్లుపడి దెబ్బతినకుండా అవసరమైన చోట డైవర్షన్లు, గేట్‌వాల్స్ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమాధానం ఇచ్చారు.



ఉమ్మడి జిల్లాలో గ్రామపాలనాధికారుల పోస్టులు

రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
549	585	34

'రెవెన్యూ' బలోపేతం

పల్లె పాలన మరింత మెరుగు

గ్రామపాలనను గాడిలో పెట్టేందుకు పలు మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే రద్దయిన వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థల స్థానంలో గ్రామంలో అన్ని రెవెన్యూ వ్యవహారాలను చూసేందుకు గ్రామపాలనాధికారుల (జీపీఓ) వ్యవస్థను తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలు పెట్టింది. కొద్దిరోజుల్లో ఈ ప్రక్రియను గాడిలో పెట్టేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. తాజాగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం త్వరలోనే ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామపాలనాధికారిని నియమించనున్నారు.

- గ్రామపాలనాధికారుల నియామకంపై కసరత్తు
- గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారికే అవకాశం
- ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ
- రాతపరీక్ష ద్వారా ఎంపిక
- ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ప్రభుత్వ యోచన ప్రకారం రంగారెడ్డిజిల్లాలో 549 మంది, వికారాబాద్ జిల్లాలో 585 మంది, మేడ్చల్ జిల్లాలో 34 మంది గ్రామపాలనాధికారుల నియామకాలు జరగనున్నాయి. అయితే మేడ్చల్ జిల్లా మొత్తాన్ని పట్టణ ప్రాంతంగా మార్చాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించడంతో ఈ జిల్లాలో గ్రామపాలనాధికారుల పోస్టులపై కొంత సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉంటే గ్రామపాలనాధికారుల నియామకాల కోసం ఇప్పటికే చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. గతంలో పనిచేసిన వీఆర్వో, వీఆర్ఏల్లో ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. త్వరలో ధరణి స్థానంలో భూభారతి తీసుకువస్తున్న సర్కార్.. ఈ బాధ్యతల నిర్వహణను గ్రామస్థాయిలో జీపీఓలకు అప్పగించనుంది. కొత్తగా అమలు చేయనున్న భూభారతితో పాటు గ్రామంలో రెవెన్యూ పనులతో పాటు కొన్ని పంచాయతీశాఖకు సంబంధించిన వ్యవహారాలను

మిగతా 7వ పేజీలో...

ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్నాం

» జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

యాచారం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భజలం గణనీయంగా పడిపోవడంతో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని.. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించే వారిపై నిఘా వేశామని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు వెల్లడించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' అడిగిన మరికొన్ని ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: రైతు వేదికల నిర్వహణకు నిధులు వస్తున్నాయా.?

జవాబు: ప్రతీ మూడు నెలలకో సారి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. పలుచోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటి వసతి లేదు.

ప్రశ్న: జిల్లాలో భూసార పరీక్షా కేంద్రాలు ఎన్ని ఉన్నాయి..? దీనిపై రైతులను ఎలా చైతన్యపర్చుతున్నారు?

జవాబు: జిల్లాలో ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్‌లలో భూసార పరీక్షా కేంద్రాలున్నాయి. ఆయా మండలాల ఏవో, ఏఈవోలు గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రశ్న: సేంద్రియ ఎరువుల వాడకంపై ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

జవాబు: ప్రతీ వారం రైతు వేదికల్లో రైతులతో సమావేశమై సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాల గురించి అధికారులు రైతులకు వివరిస్తున్నారు. జీలుగను రాయితీతో అందిస్తున్నాం.

ప్రశ్న: నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయాలకు అడ్డుకట్ట వేయడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఎవరైనా నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే వాటిని కొనుగోలు చేయాలని ఏఈవోలు రైతులకు సూచనలు చేస్తున్నారు.

ప్రశ్న: వానాకాలం సీజన్‌కు ఎరువులు సిద్ధం చేశారా?

జవాబు: ప్రతీ మండలానికి వెళ్లి వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న. పలుచోట్ల సొసైటీలలో, లైసెన్స్ ఉన్న దుకాణాలలో ఎరువులు పుష్కలంగా ఉన్నాయి.

ప్రశ్న: వేసవిలో రైతులకు మీరిచ్చే సలహా ఏమిటి?

జవాబు: వేసవిలో దుక్కులు దున్నితే పంటలకు చీడపీడ ఉండదని రైతులకు చెబుతున్నాం.

ప్రశ్న: రైతులకు పథకాల వర్తింపు ఎలా జరుగుతుంది?

జవాబు: భూముల క్రయ విక్రయాలు జరిగితే ఆయా మండలాల్లో ఉన్న రైతువేదికల్లో ఉన్న ఏఈవోలకు పట్టా పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా బుక్, ఆధార్‌కార్డులు అందిస్తే రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు రైతులకు వర్తించేలా చేస్తాం.



చౌదరిగూడ: ముష్టిపల్లిలో వరి పైరును మేస్తున్న పశువులు

తడారి.. నెర్రెలు బారి!

ఎండుతున్న వరి పైర్లు

- పెరిగిన ఉష్ణోగ్రతలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చుక్కనీరు పోయని బోరుబావులు
- పశువులకు మేతగా వరి పంట
- ఆందోళనలో రైతులు



ఇబ్రహీంపట్నం : పశువుల మేత కోసం ఎండిన వరిని కోస్తున్న మహిళ

ఇబ్రహీంపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వరి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పంటలు కోత దశలో కళ్ల ముందే ఎండిపోతుంటే అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భానుడి భగభగలకు రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో బోరుబావుల నుంచి చుక్కనీరు రావడం లేదు. దీంతో వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. కనీసం పశువుల దప్పిక తీర్చడానికి కూడా కొన్నిచోట్ల నీరు దొరకడం లేదు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో రెండేళ్లుగా వర్షపాతం తక్కువగా ఉంది. యాసంగి సీజన్‌లో బోర్లలో ఉన్న నీటిని చూసి రైతులు వరి, ఇతర ఆరుతడి పంటలు సాగు చేశారు. గత ఇరవై రోజులుగా పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో బోరు బావులు ఎండిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం, ముకునూరు, పోల్కంపల్లి, రాయపోల్ గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రంగారెడ్డి జిల్లాలోనే వరి సాగులో దండుమైలారం అగ్రస్థానంలో ఉంటుంది. ఇక్కడ యాసంగిలో సుమారు 1200 ఎకరాల మేర వరి సాగు చేశారు. కాముని చెరువు, ఎర్రగుండ కట్ట కింద గింజ పాలుపోసుకుంటున్న దశలో పంట చేలు ఎండుతున్నాయి. వరి పంటకు రైతులు నీటిని అందించలేక చివరికి పశువులను మేపుతున్నారు. ఒక్క దండుమైలారంలోనే వంద ఎకరాలకు పైగా వరి పంటలు ఎండిపోయాయి. ఏ మేరకు

మిగతా 8వ పేజీలో...

తొమ్మిది బోర్లు వేసినా నీరు పడలే...



నాలుగెకరాల్లో వరి సాగు చేశాను. భూగర్భ జలాలు తగ్గి పంటలకు నీరందక ఎండుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు తొమ్మిది బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. ఒక్కో బోరుకు రూ.35వేల వరకు ఖర్చయింది. ప్రస్తుతమున్న బోరుతో అర ఎకరం పారుతోంది. ఇంకొన్ని రోజులైతే అది పారడమూ కష్టంగానే అనిపిస్తుంది. అప్పులెలా తీర్చాలో అర్థం కావడం లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కావలి జంగయ్య, రైతు, వీరన్నపేట్, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

భౌగోళికంగా మున్సిపాలిటీల ఏర్పాటు

» చేవెళ్ల, మొయినాబాద్‌లపై మంత్రి శ్రీధర్‌బాబు



చేవెళ్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : భౌగోళికంగా ఇబ్బందులు తలెత్తకుండా కొత్తగా ఏర్పాటు చేసిన చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో మరిన్ని గ్రామాలను విలీనం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినట్లు అసెంబ్లీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తావించారు. చేవెళ్ల మున్సిపాలిటీని మొదట 8 గ్రామ పంచాయతీలతో ఏర్పాటు చేశారు. మరో నాలుగు పంచాయతీలు కూడా కలపాలని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పలుమార్లు కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలకు వినతి పత్రాలు ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే యాదయ్య ప్రభుత్వానికి నివేదిక అందించారు. దీంతో అసెంబ్లీలో చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తున్న పంచాయతీల గురించి మంత్రి శ్రీధర్‌బాబు ప్రస్తావించారు. చేవెళ్లలో మరో నాలుగు గ్రామ పంచాయతీలు, మొయినాబాద్ మరో గ్రామ పంచాయతీ విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో చేవెళ్ల, మొయినాబాద్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

» డీఆర్‌డీవో పీడీ శ్రీలత



పెరటి కోళ్ల షెడ్డును ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో


ఆదిబట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత ఆకాంక్షించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడులో పర్యటించారు. గ్రామంలో ఉపాధిహామీ నిధుల కింద మంజూరైన రూ.2.99 లక్షలతో బుట్టి రాధిక నిర్మించిన మదర్ బర్డ్స్ పౌల్ట్రీ ఫామ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని మహిళా సంఘం సభ్యులను ఎంపిక చేసి పారిశ్రామికంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఎలిమినేడులో బుట్టి రాధిక పెరటి కోళ్ల పెంపకం షెడ్డుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మహిళ సంఘాల ద్వారా పాడి పరిశ్రమలకు లోన్ తీసుకున్న వారికి పశువుల షెడ్డు నిర్మాణం కోసం ఉపాధి పథకం కింద రూ.83 వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 5ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు పండ్ల తోటలు పెంచుకుంటే పూర్తి సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం క్లస్టర్ ఏపీడీ నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్, సీసీ నర్సింహ్మా, పంచాయతీ కార్యదర్శి రవీందర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



నత్తనడకన పనులు

- కద్తాల్-గొర్లకుంట రోడ్డుపూ కంకరపోసి వదిలేశారు
- రెండేళ్లయినా పూర్తికాని నిర్మాణం

8



ఆదా చేస్తేనే గృహజ్యోతి

- 200 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ పథకం వర్తింపు
- పొదుపుగా వాడుకుంటేనే లబ్ధి

6

అక్రమ పోస్టింగులను రద్దు చేయాలి



మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ అక్రమ పోస్టింగ్స్‌ను రద్దు చేయాలని సేవ్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు బత్తుల మధుకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శి తలారి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో స్థానిక ఉపాధ్యాయ, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయం గురించి బీజేపీ రాష్ట్ర శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లాలో జీవో 317 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి నిర్ధారించిన క్యాడర్ స్ట్రెంత్‌కు మించి 600వరకు కేటాయింపులు జరిగాయని, ఫలితంగా జిల్లాలో స్థానిక డీఈడీ, బీఈడీ చేసిన నిరుద్యోగులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. రంగారెడ్డిలో 650, మేడ్చల్‌లో 125, వికారాబాద్‌లో 225 ఉపాధ్యాయ ఖాళీలను కోల్పోవడం జరిగిందన్నారు. స్థానిక ఉపాధ్యాయులకు రావాల్సిన 500కు పైగా పదోన్నతులు కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. జిల్లాలో స్పౌజ్ పేరిట మరో 54మంది టీచర్లు జిల్లాలోకి వచ్చారన్నారు. మ్యూచువల్ బదిలీల పేరుతో నెలల వ్యవధిలో రిటైర్మెంట్ ఉన్నవారికి అవకాశం ఇచ్చి, ఆ ఖాళీల్లో సర్వీసు ఎక్కువ ఉన్నవారు జిల్లాలోకి వస్తున్నారన్నారు. ఫలితంగా ఇక్కడ పోస్టులు ఖాళీ కావడం లేదన్నారు. స్థానిక నిరుద్యోగ, ఉపాధ్యాయ హక్కులను పరిరక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా క్యాడర్ స్ట్రెంత్‌ను మించి జరిగిన కేటాయింపులను గుర్తించి వారందరినీ జిల్లా నుంచి వెనక్కి పంపించాలని వారు కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మూడుచింతలపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లిలో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని బుధవారం అదనపు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డితో మాట్లాడి నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న విజయేందర్‌రెడ్డి

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

కొడంగల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, మున్సిపల్, మండల/జిల్లా పరిషత్‌లలో ఇద్దరు చొప్పున దివ్యాంగులను నామినేట్ చేసేలా చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్, డివిజన్ కార్యదర్శి ఎస్.మారుతి, జిల్లా మహిళా కన్వీనర్ కె.సావిత్రమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో చట్టం చేయాలని బుధవారం కొడంగల్ బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల 1 నుంచి 30వరకు రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. యాదమ్మ పాల్గొన్నారు.


సంతకాల సేకరణ చేపడుతున్న దశరథ్

పంచాయతీ సిబ్బందికి గుర్తింపు కార్డుల అందజేత


సిబ్బందికి గుర్తింపు కార్డులు అందిస్తున్న అధికారులు

చౌడాపూర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చౌడాపూర్, మందిపాల్ గ్రామాల్లో బుధవారం పంచాయతీ సిబ్బందికి అధికారులు గుర్తింపు కార్డులు అందించారు. తహసీల్దార్ ప్రభు, ఎంపీడీవో సోమలింగం మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది రోజూ గ్రామ పరిసరాలను శుభ్రం చేస్తుంటారని, వారి సంక్షేమం కోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజిరెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మర్పల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం మర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నీరు పోయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంపీవో లక్ష్మీకాంత్, ఏపీవో అంజిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

నిర్మాణాలను అడ్డుకుంటే ఊరుకోం

పరిగి,మార్చి 26(ఆంధ్రజ్యోతి): పరిగి పరిధి తుంకులగడ్డలో నిర్మించుకుంటున్న పేదల ఇళ్లను అడ్డుకుంటే ఊరుకోం అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పేదలతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పట్టాలిచ్చారన్నారు. ఎమ్మెల్యేనే అధికారులతో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే నిర్మించుకున్న వారికి ఇంటి నంబరు ఇవ్వలేదని, దీంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదన్నారు. పేదలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి ఇంటి నంబర్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, హబీబ్, శేఖర్, గౌస్, గఫ్ఫార్, వెంకటయ్య, చంద్రమౌళి, అశోక్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



బకాయిదారులకు ఊరట!

● పన్ను చెల్లింపునకు 'ఓటీఎస్'

తాండూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఆస్తిపన్ను మొండి బకాయిలున్న యజమానులకు 'వన్ టైం సెటిల్మెంట్'(ఓటీఎస్) స్కీంను తెచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరలో ఓటీఎస్‌ను అమల్లోకొచ్చింది. ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీని వర్తింపజేసింది. బుధవారం నుంచి ఓటీఎస్ అమల్లోకి వచ్చింది. ఆస్తిపన్ను వసూళ్లలో వెనుకబడిన తాండూరు బల్దియాకు ఓటీఎస్ ఊతమిచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 37శాతమే ఆస్తిపన్ను వసులైంది. మున్సిపాలిటీలో ట్యాక్స్ వసూళ్ల డిమాండ్ ఏప్రిల్‌లో రూ.13కోట్లుండగా కుదించిన అంచనాలతో రూ.9.64కోట్లకు తగ్గింది. ఓటీఎస్ ద్వారా కోటి వసూలు చేసేందుకు అధికారులు బ్యానర్లు, మైకుల ద్వారా ప్రచారాన్ని చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఒక నెల మాత్రమే గడువుండంతో బకాయిల వసూళ్లకు దృష్టి సారించారు.

కేంద్ర మంత్రిని కలిసిన మారుతీకిరణ్

పరిగి,మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఢిల్లీలోని ఆయన నివాసంలో బుధవారం బీజేపీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి బి.మారుతీకిరణ్ కలిశారు. భువనగిరి మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్‌తో కలిసి అమిత్‌షాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను, బీజేపీ అనుకూలతలను షాకు వివరించామని మారుతీకిరణ్ తెలిపారు.


అమిత్‌షాతో బీజేపీ పరిగి ఇన్‌చార్జి మారుతీకిరణ్

న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బస్వరాజ్

వికారాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా నూలి బస్వరాజ్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో న్యాయవాదులు బస్వరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పోలీస్ వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మోహన్ రాథోడ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పరమేష్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శుక్ల వర్ధన్‌రెడ్డి ప్రకటించారు. తాను సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన న్యాయవాదులకు బస్వరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.


బస్వరాజ్ పటేల్


వెంకట్‌రెడ్డి, కార్యదర్శి

ఐక్యరాజ్య సమితి మీట్‌లో బషీరాబాద్ యువకుడు


యూఎన్‌వో మీట్‌లో సాయిసంపత్(ఫైల్)

బషీరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి 58వ మానవహక్కుల మండలి సమావేశంలో భారత్ తరపున బషీరాబాద్ మండలం బద్లాపూర్‌నకు చెందిన మెట్టు సాయిసంపత్ పాల్గొన్నారు. ఈనెల 24 జెనీవాలో ప్రపంచ మానవహక్కులపై జరిగిన సమావేశంలో 'భారతదేశంలో మానవ హక్కులు' అనే అంశంపై ప్రసంగించినట్లు, దేశం పురోగతిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చానని ఆయన తెలిపారు.

ఆదా చేస్తేనే గృహజ్యోతి

● 200 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ పథకం వర్తింపు
● పొదుపుగా వాడుకుంటేనే లబ్ధి

షాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎండలు దంచికొడుతున్నాయి. ఉష్ణోగ్రత 36డిగ్రీలు నమోదవుతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం పెరుగుతోంది. మార్చి నుంచే ఎండలు ముదిరిపోతున్నాయి. ఈ తరుణంలో నెలవారీ యూనిట్ల వాడకం 200యూనిట్లు దాటితే గృహజ్యోతి ఉచితన కరెంటు పథకం వర్తించదు. జీరో బిల్లు రాదు. ఈ నేపథ్యంలో జీరో బిల్లు రావాలంటే విద్యుత్‌ను పొదుపుగా వాడడం తప్పనిసరి. గృహ వినియోగదారులు కొన్ని పొదుపు చర్యలు పాటిస్తే వారికి ప్రయోజనం చేకూరుతుంది. షాబాద్ మండలంలో 41 పంచాయతీలు ఉండగా గృహజ్యోతి కింద 8,416 విద్యుత్ కనెక్షన్లున్నాయి. వాటిలో గతనెలలో 8,202 మంది 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తూ జీరో బిల్లుతో లబ్ధిపొందారు.

జీరో బిల్లు కోసం విద్యుత్‌ను ఇలా వాడాలి

● మార్కెట్‌లో ఫైవ్(5) స్టార్ రేటింగ్ ఉన్న గృహోపకరణాలు కొనుగోలు చేసి వాడితే విద్యుత్ ఆదా అవుతుంది.

● టీవీ అవసరం లేకపోతే రిమోట్‌తో కాకుండా పూర్తిగా నిలిపివేయాలి. ఫోన్‌చార్జింగ్ పూర్తయ్యాక ఎడాప్టర్‌ను ప్లగ్ నుంచి తీసేయాలి.

● ఫ్యాన్లు అవసరమైతేనే వేయాలి. ఫ్రిడ్జిలో ఫ్రీజర్ దశను కాలానుగుణంగా మార్చుకోవాలి.

● ఏసీల ఫిల్టర్లను శుభ్రం చేస్తూ ఏసీకి మూడు నుంచి ఐదు గంటల లోపు టైమర్‌ను సెట్ చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుంది.

విద్యుత్‌ను వృథా చేయొద్దు



ఎండలు పెరుగుతున్న దృష్ట్యా అధిక విద్యుత్ వాడకంతో ఈ నెల నుంచి అధిక బిల్లులొచ్చే అవకాశం ఉంది. 200యూనిట్లు దాటితే జీరో బిల్లు రాదు. తక్కువ యూనిట్లు వాడితేనే జీరో బిల్లొస్తుంది. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి.
- జీవీ.కోటేశ్వరరావు, ఏఈ, ట్రాన్స్‌కో, షాబాద్

(ఐదో పేజీ తరువాయి)

'రెవెన్యూ' బలోపేతం

కూడా జీపీఓలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు జీపీఓల నియామకం కోసం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఆప్షన్లు కూడా తీసుకుంది. ఏ రెవెన్యూ డివిజన్, ఏ మండలం, ఏ గ్రామంలో పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నారు..? గతంలో ఎక్కడ పనిచేశారు.. ? అనే సమాచారం కూడా దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వం తీసుకుంది. దరఖాస్తుదారులకు రాతపరీక్ష నిర్వహించి ఇందులో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయనుంది. ఎంపిక చేసిన వారికి కొత్తగా అమలు చేయనున్న 'భూభారతి'తో పాటు ఇతర కీలక అంశాలపై కొద్ది రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారం!

కొత్తగా నియమించే గ్రామపాలనాధికారులతో రెవెన్యూ వ్యవస్థ క్షేత్రస్థాయిలో మళ్లీ బలోపేతం కానుంది. గతంలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేయడంతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలహీన పడింది. అన్ని వ్యవహారాలు కూడా తహసీల్దార్, ఆపై అధికారులే చూడాల్సి వచ్చింది. క్షేత్రస్థాయిలో సమాచారం కూడా సరిగా అందుబాటులో ఉండడం లేదు. ఇపుడు ప్రభుత్వం గ్రామపాలనాధికారులను నియమించనుండడంతో గ్రామంలో రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. అనేక గ్రామాల్లో రెవెన్యూ రికార్డులు సరిగా లేక సరిహద్దుల వివాదాలు, మ్యాపులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో రెవెన్యూ సమస్యలు అధికమై కోర్టుల్లో వివాదాలు పెరుగుతున్నాయి. అంతా ఆన్‌లైన్ చేయడంతో మ్యానువల్ రికార్డులు అందుబాటులో లేక బాధితులకు సకాలంలో న్యాయం జరగడం లేదు. అసలు రికార్డులు పోవడంతో పొరపాట్లు ఎక్కడ జరిగాయి? అనేది మరోమారు సరిచూసుకునే పరిస్థితి ఇపుడు లేదు. భూభారతి అమల్లోకి తెచ్చి మ్యానువల్ రికార్డులు కూడా పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్వహణ కోసమే ఇపుడు గ్రామపాలనాధికారుల నియామకాలు చేపడుతోంది. గ్రామంలో ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర రెవెన్యూ సేవలు గ్రామపాలనాధికారులకు అప్పగించనున్నారు. అలాగే రేషన్‌కార్డుల జారీ, వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో కూడా వీరే కీలకం కానున్నారు.

రాతపరీక్షపై అనాసక్తి

ఇదిలా ఉంటే గ్రామపాలనాధికారి పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారు రాతపరీక్షపై అనాసక్తి చూపుతున్నట్లు తెలిసింది. గతంలో తాము వీఆర్వో, వీఆర్ఏ పోస్టుల్లో పనిచేసినందున మళ్లీ రాతపరీక్ష ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాతపరీక్షల్లో అర్హత పొందకుంటే ఇది తమకు అవమానకరమేననే భావనతో ఉన్నారు. దీంతో కొందరు అసలు దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం.

నిరుద్యోగుల్లో ఆశలు

గ్రామపాలనాధికారి పోస్టులు భర్తీ కాకుండా నోటిఫికేషన్ ఇచ్చి కొత్తగా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. గ్రామపాలనాధికారి పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలనే నిబంధన పెట్టారు.



కోనాపూర్‌లో బోనాలతో తరలుతున్న మహిళలు

కోనాపూర్‌లో ఘనంగా బోనమ్మ జాతర

తాండూరురూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోనాపూర్‌లో బుధవారం బోనమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరి నైవేద్యాలు సమర్పించారు. పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, నాయకులు రాజుగౌడ్, ఆర్.వెంకటేశ్, వెంకటయ్య, బంటు రాములు, ఆశప్ప, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యపానంతో కలిగే అనర్థాలపై అవగాహన

శామీర్‌పేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మద్యం తాగితే కలిగే అనర్థాలు, నష్టాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు నాటక రూపంలో అవగాహన కల్పించారు. మంగళవారం రాత్రి లాల్‌గడిమలక్‌పేటలో హైదరాబాద్‌లోని ప్రగతి మహావిద్యాలయ డిగ్రీ, పీజీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్యాంప్ ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శోభారాణి ఆధ్వర్యంలో మద్యపానంతో అనర్థాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నాటక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, శామీర్‌పేట ఎస్సై ప్రత్యూష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల జేఏసీని బలోపేతం చేయాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగుల జేఏసీని బలోపేతం చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అన్ని సంఘాలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు, టీఎన్జీవో సెక్రటరీ శ్రీనేష్‌కుమార్, విజయకుమార్, ప్రవీణ్, గోపాల్ నాయక్, ఇస్మాయిల్, నూతనపడి వెంకట్ పాల్గొన్నారు.



రావులపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ భూపాల్‌శ్రీధర్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

చేవెళ్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్ సీసీ కెమెరాలను బాగు చేయించి అవసరం ఉన్నచోట్ల ఏర్పాటు చేయించడం హర్షనీయమన్నారు. నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శిరీష, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కె.నరేందర్‌యాదవ్, మాజీ ఉప సర్పంచ్ పి.నాగిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు సత్యనారాయణ, అశోక్, చాకలి జంగయ్య పాల్గొన్నారు.

పెండింగ్ పాలబిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

తలకొండపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విజయ పాడి రైతులకు పెండింగ్ పాలబిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్యలు కోరారు. పాల బిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. గట్టిప్పలపల్లిలో గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలుగు పక్షాల బిల్లులు పాడి రైతులకు రావాల్సి ఉందన్నారు. నాయకులు ఏదుల రాజు, కానుగుల జంగయ్య, కృష్ణయ్య, అశోక్‌గౌడ్, కొండల్, లక్ష్మీపతి, విజేందర్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఆమనగల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.1.52లక్షల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు అందజేశారు. నాయకులు ఆనంద్, యాటనర్సింహ, సంజీవ్ యాదవ్, విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, యాదగిరి రెడ్డి, బాబా, అనంతరెడ్డి, విజయ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

చౌదరిగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ కోరారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో కొనసాగున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. సకాలంలో కూలీ డబ్బులు చెల్లించకుంటే పనులు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. కూలీలకు కనీస వసతులతోపాటు రోజువారి కూలీని రూ.700కు పెంచి రెండు వందల రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. కూలీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కృష్ణ, రంగయ్య, అంతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎండ తీవ్రతతో వెలవెలబోతున్న పాంబండ

భానుడు భగభగ... 'పాంబండ' వెలవెల

కులకచర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఉష్ణోగ్రతలు ఘననీయంగా పెరుగుతున్నాయి. 40 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. భానుడిభగభగలకు ప్రజలు పనులు వాయిదా వేసుకుంటున్నారు. దంచి కొడుతున్న ఎండలకు బుధవారం కులకచర్ల మండలంలోని పాంబండ జాతర వెలవెలబోయింది. ప్రజలు లేక గిరాకీ తగ్గిందని వ్యాపారులు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి నిర్వహించే అగ్నిగుండాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య తెలిపారు.

శామీర్‌పేట మండలంలో...
మరో మునిసిపాలిటీ

- కొత్త బల్దియాగా అలియాబాద్
- గతంలోనే ఏర్పాటైన తూంకుంట పురపాలిక



శామీర్‌పేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట మండలంలో కొత్తగా మరో మున్సిపాలిటీ ఏర్పాటైంది. ఏడు గ్రామాలతో అలియాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్టు బుధవారం శాసన మండలిలో బిల్లును పాస్ చేశారు. అసెంబ్లీలో మంగళవారమే ఈ బిల్లుకు ఆమోదం తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ఈ మేరకు అలియాబాద్‌ను మున్సిపాలిటీగా చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ స్టేట్ మున్సిపల్ అమెండ్‌మెంట్ బిల్లులో కొత్త మున్సిపాలిటీని జత చేశారు.

విలీన గ్రామాలివే..

అలియాబాద్ కేంద్రంగా మున్సిపాలిటీని చేశారు. ఆరు గ్రామాలు లాల్‌గడీ మలక్‌పేట, తుర్కపల్లి, యాడారం, మురహరిపల్లి, మజీద్‌పూర్, పొన్నాల్ గ్రామాలను ఈ మున్సిపాలిటీలో విలీనం చేశారు. కొత్త మున్సిపాలిటీలో 42,495 మంది జనాభా, 22,460 మంది ఓటర్లు ఉన్నట్టు ప్రభుత్వం పేర్కొంది. కాగా తూంకుంటను 2020లోనే ప్రభుత్వం బల్దియాగా మార్చింది. తూంకుంట, మందాయిపల్లి, ఉప్పరిపల్లి, హంకీంపేట, సింగాయిపల్లి, దేవరయంజాల్, పోతాయిపల్లి, యెలిగలగూడ, అంతాయిపల్లి గ్రామాలతో మున్సిపాలిటీని చేశారు. అయితే సెప్టెంబరు-2024లో ప్రభుత్వం శామీర్‌పేట, బాబాగూడ, బొమ్మరాసిపేట గ్రామాలను సైతం తూంకుంట మున్సిపాలిటీలో విలీనం చేసింది. దీంతో శామీర్‌పేట గ్రామ పంచాయతీలు లేని మండలంగా ప్రత్యేకత సంతరించుకుంది.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అలియాబాద్‌ను మున్సిపాలిటీగా చేసినందుకు అలియాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు కంతం క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో బిల్లును పాస్‌చేయడం సంతోషకరం అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ ఆవిర్భానికి డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ ఎంతో కృషిచేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, మల్లేశ్, రాము, నాగమల్లారెడ్డి, అశోక్, ప్రకాశ్‌గౌడ్, రాంచందర్, నర్సింగరావు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు

మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలి

మహేశ్వరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని, అంతవరకు ఉద్యమం ఆగదని, ఏప్రిల్ మొదటి వారంలో అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజాభిప్రాయం, సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఫ్యూచర్‌సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, కె.జంగయ్యయాదవ్‌లు అన్నారు. బుధవారం మహేశ్వరంలోని కర్నాటి కళాభవన్‌లో ఫ్యూచర్‌సిటీ సన్నాహక సమావేశం జరిగింది. రఘుపతి, జంగయ్యయాదవ్‌లు మాట్లాడుతూ త్వరలో మహానగరంగా విస్తరించనున్న మహేశ్వరం అంటూ ప్రభుత్వం ప్రకటనలు చేసిందని.. ఇప్పుడు అదే మహేశ్వరాన్ని మాయం చేసే విధంగా ఫ్యూచర్ సిటీలో కలపకుండా దూరం చేస్తున్నారన్నారు. హైదరాబాదుతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీకి ఆనుకొని ఉన్న మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాలన్నారు. ఇప్పటికే మండలంలోని తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్ గ్రామాలను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. మహేశ్వరం నుంచి రోజు రోజుకూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో అన్ని గ్రామాల్లో ప్రజాభిప్రాయం, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు ఉధృతంగా చేపడతామన్నారు. గౌరవాధ్యక్షుడు కర్నాటి మనోహర్, మల్లేష్‌యాదవ్, కె. జంగయ్యయాదవ్ , రాజునాయక్, బి.నర్సింహ యాదవ్, యాదయ్యగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, దత్తునాయక్, సుదర్శన్‌యాదవ్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

నాపరాళ్ల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ



పట్టుబడిన లారీలు

తాండూరురూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాపరాళ్ల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, తెలంగాణ-కర్నాటక సరిహద్దులోని మిర్యాణ్ నుంచి రాయల్టీ లేకుండా అక్రమంగా నాపరాళ్లను తరలిస్తే పెద్ద ఎత్తున జరిమానా విధిస్తామని తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ వద్ద ఒక్కో లారీకి రూ.9వేల 500ల చొప్పున 11 నాపరాతి లారీలకు రూ.1,04,500 జరిమానా విధించారు. ఎవరైనా గనుల్లో నుంచి నాపరాతిని అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా తెలంగాణ సరిహద్దులోని మల్కాపూర్, ఓగీపూర్, కరన్‌కోట్, సంగెంకలాన్, సిరిగిరిపేట్ తదితర గ్రామాలకు చెందిన నాపరాళ్లను తరలించే ముందు తప్పకుండా రాయల్టీ పొందాలని సూచించారు. లీజులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపితే ఆ గనుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భారీ ఎత్తున జరిమానా విధిస్తామన్నారు.

మేమెలా బతకాలి?

- ఏడు నెలలుగా జీతాలివ్వడం లేదు
- పీఆర్ శాఖ మంత్రి సీతక్కకు మున్సిపల్ కార్మికుల మొర



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

శామీర్‌పేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, జీతాలు లేకుండా తామెలా బతకాలని తూంకుంట మున్సిపల్ కార్మికులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు మొరపెట్టుకున్నారు. తూంకుంట మున్సిపాలిటీ శామీర్‌పేట వార్డు పారిశుధ్య, ఇతర కార్మికులు 26 మందికి పంచాయతీగా ఉన్న కాలంలో రెండు నెలల జీతం, మున్సిపాలిటీలో విలీనం తరువాత పెంచిన ఐదు నెలల జీతాలూ ఇవ్వలేదు. బుధవారం ఐఎఫ్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో శామీర్‌పేట వార్డు కార్మికులు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఏడు నెలలుగా జీతాల్లేక నిత్యావసర సరుకులకు అప్పులు చేశామని, కుటుంబాలకు ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్ జీతాలను చెల్లించాలని కార్మికులు మంత్రికి మొరపెట్టుకున్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న రమేష్, లక్ష్మీనారాయణగౌడ్

మహేశ్వరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో పలువురు రేషన్ డీలర్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రతీనెల రూ.5 నుంచి 10 వేలతో పాటు క్వింటాలుకు రూ.3 వందల చొప్పున కమీషన్ చెల్లించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి మినీ వేబ్రిడ్జీల ద్వారా తూకం వేయకుండా బియ్యం పంపడం వల్ల ఒక్కో షాపునకు 2నుంచి 3 క్వింటాళ్ల బియ్యం తక్కువ వస్తోందన్నారు. బియ్యం బస్తాలలో వస్తుండటంతో దుమ్ము, ధూళి కారణంతో డీలర్లు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరోనా సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 149 మంది డీలర్లు చనిపోయారని.. బాధిత కుటుంబాలకు గత ప్రభుత్వం ఏమాత్రం సాయం చేయలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదుకోవాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యల్ని పరిష్కరించాలని మంత్రికి వివరించినట్లు వారు తెలిపారు. డీలర్ల సమస్యల వినతి పత్రాన్ని పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్, ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయ్, సురేష్, సందీప్, వినయ్, షాకిర్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

చౌదరిగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు నర్సింహులు అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు డిక్లరేషన్ ఇచ్చిందన్నారు. గతంలో రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న వారికి రాజీవ్ యువ వికాసంలో భాగంగా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బాబురావు, గణేష్, యాదయ్య, జహంగీర్, రాంచంద్రయ్య, మోతిలాల్ పాల్గొన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

యాచారం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, సొసైటీలో బకాయిలున్న రైతులు సకాలంలో చెల్లించి వడ్డీల భారం తగ్గించుకోవాలని, యాచారం మండల సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.27 కోట్ల బకాయిలుండగా రూ.9కోట్ల వసూలు చేశామన్నారు. ఈనెల 31 వరకు బకాయిలు చెల్లించి సంఘ ప్రగతికి తోడ్పాటునందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రూ.12లక్షలతో డ్రోన్ తీసుకొచ్చి అవసరమున్న రైతులకు అద్దెకివ్వడానికి యత్నిస్తున్నామని చెప్పారు. మాల్, నందివనపర్తి, మేడిపల్లిలో కొత్తగా సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. నాణ్యమైన విత్తనాలు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు. అనంతరం డ్రోన్ పనితీరును సాంకేతిక నిపుణులు వివరించారు. సొసైటీ డైరెక్టర్లతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ, అక్బర్, సీఈవో నాగరాజు, మహేష్ తదితరులున్నారు.

స్వామియే శరణమయ్యప్పా..

- వైభవంగా అయ్యప్ప, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



అయ్యప్ప ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్

నందిగామ/షాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప విగ్రహంతో పాటు ఇతర దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం శబరిమల ఆలయ ప్రధాన పూజారి బ్రహ్మశ్రీ కంఠారు రాజీవరు తాంత్రి స్వామి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో అయ్యప్ప భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. ఐదు రోజులుగా హోమాలు, యజ్ఞాలతో పాటు దేవాలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌తో పాటు షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన దాతలను, అతిథులను ఆలయ కమిటీసభ్యులు సన్మానించారు. నాయకులు మిథున్‌రెడ్డి, మామిడి జనార్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, జిల్లెల్ల రాంరెడ్డి, ఈట గణేష్, జంగ నర్సింలు, రేగొండ రవీందర్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, దేవేందర్ యాదవ్, సుదర్శన్‌గౌడ్, మామిడి విక్రమ్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు. అలాగే అయ్యప్ప స్వామి మహిమ ఎంతో గొప్పదని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి సతీమణి సాన్విరెడ్డి అన్నారు. అయ్యప్ప ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, షాబాద్ మండల గురుస్వాములు దర్పల్లి రవీందర్‌గౌడ్, కమ్మరి శ్రీను, నాగేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భీంలాల్‌నాయక్ తదితరులున్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు



ఆర్జీఐఏ పీఎస్ సీఐ బాలరాజు

శంషాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాలరాజు సూచించారు. సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, ఇంటి చుట్టుపక్కల ఉండే వాళ్లకు విషయం చెప్పాలని అన్నారు. చోరీల నియంత్రణకు ప్రత్యేక నిఘా పెంచుతామన్నారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ఈమేరకు బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ఫేస్ టు ఫేస్

ప్రశ్న : చోరీలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: చోరీలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా పోలీసు పెట్రోలింగ్‌ను పెంచడంతోపాటు చుట్టుపక్కల బస్తీల వాళ్లను అప్రమత్తం చేస్తున్నాం. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు. ?

జవాబు: శంషాబాద్‌లోని హైదరాబాద్-బెంగుళూరు ఎన్‌హెచ్‌పై ఫ్లైఓవర్‌కు రెండువైపులా ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేశాం. నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే రికవరీ వ్యాన్ల ద్వారా తొలగించి యజమానులకు జరిమానా విధిస్తున్నాం. అదేవిధంగా ఓవర్ స్పీడ్, హెల్మెట్ వాడకం, సిగ్నల్ జంపింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : మాదక ద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా వాటిని విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

పశ్న : టెన్త్ పరీక్షల వేళ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ముఖ్యంగా పరీక్ష కేంద్రాల దగ్గర ఉండే అన్ని జిరాక్స్, ప్రింటింగ్ షాపులను మూసివేయిస్తున్నాం. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

నత్తనడకన రోడ్డు పనులు

- రెండేళ్లయినా పూర్తికాని పనులు
- ప్రయాణికులు నరకయాతన
- కంకరపోసి వదిలేసిన కడ్తాల్-గొర్లకుంట రోడ్డు
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆమనగల్లు : కంకర పోసి వదిలేసిన కడ్తాల్-గొర్లకుంట తండా రోడ్డు

కడ్తాల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కడ్తాల్-గొర్లకుంట తండా బీటీరోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాక రాకపోకలకు గిరిజనులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని గిరిజనులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించిన నేటికీ బీటీ వేయకపోవడంతో ప్రయాణానికి నరకయాతన పడుతున్నారు. కంకర పోసి వదిలేసినరోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బీటీ రోడ్డు అసంపూర్తి పనుల పూర్తి విషయంలో అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులకు పట్టింపు లేని ధోరణిపై గొర్లకుంట తండా గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కడ్తాల జాతీయ రహదారి నుంచి చెరువుకట్ట మీదుగా బీటీరోడ్డు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని దశాబ్ద కాలంగా గిరిజనులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దాంతో 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీఆర్ఆర్ గ్రాంట్ కింద బీటీరోడ్డు నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేసింది. 2023 జనవరి 9న అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. దాంతో తమ బాధలు తొలుగుతాయని ప్రజలు భావించారు. పనులు ప్రారంభించి చెరువు కట్ట మీదుగా బీటీరోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితం కంకరపోశారు. కిలోమీటర్ మేర రోడ్డుపై కంకర పోసి బీటీవేయకుండా వదిలేశారు. కంకర తేలి కాలినడకకు సైతం ఇబ్బందిగా మారింది. అంతకుముందు కట్టమీదుగా మట్టిరోడ్డు ఉన్నా ఇబ్బంది ఉండేది కాదని.. కంకర పోసి వదిలేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. గొర్లకుంట తండా అలుగు వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు ప్రారంభించి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని గొర్లకుండ తండా గిరిజనులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



కడ్తాల్-గొర్లకుంట తండా బీటీ రోడ్డు నిర్మాణం అసంపూర్తి పనుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. కిలోమీటరు మేర కంకర పోసి బీటీ చేయకుండా వదిలివేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బీటీ వేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలి.

- రాంచందర్‌నాయక్, గొర్లకుంట తండా

15 రోజుల్లో పనులు ప్రారంభిస్తాం



బీటీ రోడ్డు నిర్మాణం పనుల పూర్తికి చర్యలు చేపట్టాం. కాంట్రాక్టర్‌కు పనులు పూర్తి చేయాలని సూచించాం. పదిహేను రోజుల్లో పనులు ప్రారంభించడానికి అంగీకరించాడు. వీలైనంత త్వరగా పనులు చేపట్టి పూర్తిచేసి కడ్తాల్-గొర్లకుంట తండా రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- పరమేశ్, ఏఈ, కడ్తాల్

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

మాడ్గుల : మండలంలోని కొల్కులపల్లి, నర్సాయపల్లి, మాడ్గుల, పెద్దమాడ్గులలో ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో ఎటూ వెళ్లలేని పరిస్థితి. గతంలో ప్రమాదాలు జరిగాయని, రోడ్లను వెడల్పు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

ప్రభుత్వ ఉద్యోగులను బలి తీసుకున్న లారీ

- సంఘటన స్థలంలో భార్య, చికిత్స పొందుతూ భర్త మృతి
- రోదనలతో మిన్నంటిన ప్రభుత్వ ఆసుపత్రి
- అనాథలైన నలుగురు పిల్లలు



బోయ పాండు, సక్కుబాయి (ఫైల్)

కొత్తూర్, జనవరి 26(ఆంధ్ర జ్యోతి): కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి, పిల్లపాపలతో ఆనందంగా జీవిస్తున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. మృత్యురూపంలో వచ్చిన లారీ భార్యభర్తలిద్దరినీ బలి తీసుకోవడం రెండు కుటుంబాల్లో విషాదఛాయాలు అలుముకున్నాయి. కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. భార్య సంఘటన స్థలంలోనే మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ భర్త హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. భార్యభర్తలు మృతితో వారికి ఉన్న నలుగురు పిల్లలు అనాథలయ్యారు. మృతదేహాలను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా.. అక్కడికి కుటుంబసభ్యులు, బంధువుల పెద్దఎత్తున తరలివచ్చారు. వారి రోదనలు చూసి పలువురు కన్నీరుపెట్టుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలానికి చెందిన బోయ సక్కుబాయిని కొన్నేళ్ల క్రితం కల్వకుర్తి మండల రఘుపతిపేటకు చెందిన బోయ పాండుతో వివాహం జరిగింది. అనంతరం సక్కుబాయి ఓ పక్క కుటుంబాన్ని చూసుకుంటూ, పోటీ పరీక్షలు రాసి గ్రామ కార్యదర్శిగా ఉద్యోగం పొందారు. కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా మొదటగా ఉద్యోగంలో చేరారు. మూడు సంవత్సరాల పాటు విధులు నిర్వహించి ఆ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. ఇటీవల మహేశ్వరం మండలం నాగులుదోనితండాకు బదిలీపై వెళ్లారు. భర్త పాండు అంబర్‌పేట సీపీఎల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, కుటుంబసభ్యులతో కలిసి రామాంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కూతురు మధుమిత డిగ్రీ సెకండియర్, రెండో కూతురు మధురుచిత డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. కవలలైన యశ్విక్, రోక్షిత్‌లు రెండో తరగతి చదువుతున్నారు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానిక పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాజస్థాన్‌కు చెందిన లారీ ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శివారులో ఐరన్ లోడ్ చేసుకుని వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రాజస్థాన్‌కు చెందిన పర్మనెంట్ లారీ డ్రైవర్ హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా, హైదరాబాద్‌కు చెందిన టెంపరరీ డ్రైవర్ లోడింగ్‌కు వచ్చి తిరుగు ప్రయాణమవుతూ ప్రమాదానికి కారణమైనాడు. భార్య, భర్తల మృతదేహాలకు శవపరీక్ష అనంతరం పోలీసులు కుటుంసభ్యులకు అప్పగించారు. మృతదేహాలను అంత్యక్రియల నిమిత్తం రఘుపతిపేటకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మున్సిపల్ పరిధిలోని కొత్వాల్‌గూడకు చెందిన దామోదర్(40) ఈనెల 24న రాత్రి పది గంటల సమయంలో ఇంటి నుంచి పొలానికి కాలినడకన వెళ్లాడు. ఈక్రమంలో మరుసటి రోజు ఉదయం మార్గమధ్యలో చెన్నమ్మ హోటల్ సమీపంలో రోడ్డుపై మృతిచెంది ఉండగా గమనించిన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిసరాలను పరిశీలించారు. కాగా, ఏదైనా వాహనం ఢీకొట్టడంతో చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకూతుళ్లను వేధించిన కేసులో నిందితులకు జైలు

శంకర్‌పల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లోకి వెళ్లి తల్లీ కూతుళ్లను బూతులు తిట్టి, మానసికంగా వేధించిన కారణంగా ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ ఎల్‌బీ నగర్ కోర్టు తీర్పు వెల్లడించింది. పూర్తి వివరాలు మోకిల పోలీస్‌లు తెలిపారు. శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ పరిధిలోని మహరాజ్‌పేట్ గ్రామానికి చెందిన ఓ తల్లి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తూండగా.. ఆమెకు 17 సంవత్సరాల కూతురు ఉంది. 2017 డిసెంబరు 11న కూలి డబ్బులు ఇచ్చేందుకు వెంకటేశం అనే మేస్త్రీ ఇంటికి రాగా.. అదే సమయంలో గ్రామానికి చెందిన సి.భాస్కర్ వారి ఇంటికి వచ్చి బియ్యం అడిగాడు. లేవు అని తల్లీకూతుళ్ల సమాధానం ఇవ్వగా మేస్త్రీని ఇంట్లోకి ఎందుకు వచ్చావని బూతు మాటలు తిట్టాడు. అంతలోనే బద్రి రాంచంద్రయ్య అనే వ్యక్తి వచ్చి తల్లీకూతుళ్లను బూతులు తిడుతూ, మానసికంగా బాధపెట్టాడు. దాంతో తల్లీకూతుళ్ల శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారించి పోలీస్‌లు.. కేసు వివరాలను కోర్టుకు సమర్పించారు. బుధవారం ఎల్‌బీ నగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి విచారణ జరిపి సి.భాస్కర్‌కి ఏడాది జైలుతోపాటు రూ. 2 వేలు జరిమానా విధించారు. అలాగే బద్రి రాంచంద్రయ్యకు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.8 వేల జరిమానా విధించారు. బాధితురాలి కుటుంబానికి రూ.50 వేలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పును వెల్లడించినట్లు పోలీస్‌లు చెప్పారు.

మేకల దొంగల అరెస్టు

ఆమనగల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మేకల దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీస్‌లు అరెస్టు చేశారు. స్థానిక ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి ముర్తోజుపల్లిలోని బైకని రాజయ్యకు చెందిన 8 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమయస్ఫూర్తితో కేసును ఛేదించారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి జువైనల్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. దొంగతనానికి ఉపయోగించిన కారును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా.. వలస కార్మికుడి మృతి

చౌదరిగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇటుక ట్రాక్టర్ బోల్తా పడటంతో వలస కార్మికుడు మృతిచెందాడు. మండల పరిధి చెన్నారెడ్డిగూడ వద్ద బుధవారం చోటుచేసుకుంది. జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ కథనం మేరకు.. మండల పరిధిలోని జాకారం నుంచి ఎల్కాగూడలో ఇటుకను అన్‌లోడ్ చేసేందుకు ట్రాక్టర్‌పై వస్తుండగా చెన్నారెడ్డి గూడ పాఠశాల వద్దకు రాగానే బోల్తాపడడంతో వలస కూలీ ఒడిషాకు చెందిన సంతను పోరియ(40) మృతిచెందాడు. మృతుడి భార్య దేవకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దశదిన కర్మలో మధుసూదన్‌రెడ్డి



షాబాద్, మార్చి 26(ఆంధ్ర జ్యోతి): గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తల్లి జయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం మద్దూర్ గేట్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో దశదిన కర్మకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ నివాళులర్పించారు.

లబ్ధిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- రామోజీ ఫిలింసిటీ వద్ద పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఆందోళన



రామోజీ ఫిలింసిటీ వద్దకు ర్యాలీగా వస్తున్న జాన్‌వెస్లీ, లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టాలున్న లబ్ధిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లబ్ధిదారులు భూముల వద్దకు పోకుండా రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం గేట్లు పెట్టి అడ్డుపడుతోందని, గేట్లను తొలగించి పేదలకు న్యాయం చేకూర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి నాగన్‌పల్లి రెవెన్యూ రామోజీ ఫిలింసిటీలో గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీనిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ నాగన్‌పల్లి రెవెన్యూ సర్వే.నెం. 189, 203లలో 20.04 ఎకరాల ప్రభుత్వ భూమి రామోజీ ఫిలింసిటీ ఆధీనంలో ఉండగా.. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఇక్కడ ఉన్న కొన్ని కట్టడాలను తొలగించారన్నారు. అప్పట్లో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాలకు చెందిన 577మంది పేదలకు ఈ భూముల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ పథకం కింద ప్రొసీడింగ్‌లు కూడా ఇచ్చారన్నారు. అయితే ఈ భూముల్లోకి ఎవరూ రాకుండా రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం గేట్లు బిగించిందన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, పేదల భూములు ఆక్రమించిన రామోజీ సంస్థ యాజమాన్యంపై కేసు పెట్టాలని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే కొందరు ఆందోళనకారులు గేట్లు ఎక్కి లోనికి దూకగా, మరికొందరు ఒక్కసారిగా గేట్లు తోసుకుని భూముల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారుల మధ్య లోపులాట జరిగింది. జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్, వెంకటమ్మలు స్వల్పంగా గాయపడి సొమ్మసిల్లి పడిపోగా.. ఆసుపత్రికి తరలించారు. అరెస్టు చేసిన ఆందోళనకారులను ఇబ్రహీంపట్నం, యాచా రం పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భవన కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 21, 22వ తేదీలలో శంషాబాద్‌లో నిర్వహిస్తున్నామని, ప్రతీ ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పానుగంటి పర్వతాలు తెలిపారు. ఈమేరకు శంషాబాద్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పానుగంటి పర్వతాలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నర్సింహారెడ్డి, కార్యదర్శి నర్రాగిరి జిల్లా నాయకుడు అన్నెపు ప్రభులు మాట్లాడారు. వలస కార్మికులను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పనికి తగ్గవేతనాలు ఇవ్వకుండా శ్రమను దోచుకుంటున్న గుత్తేదారుల మీద బహుళ అంతస్తుల నిర్మాణ బడా కంపెనీల యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారని, పనిచేసే ప్రాంతంలో కార్మికులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలేదన్నారు. రాష్ట్ర మహాసభల మొదటి రోజు కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

తడారి.. నెర్రెలు బారి!

(5వ పేజీ తరువాయి)

పంట చేతికొస్తుందో అని రైతాంగం దిగులు పడుతోంది. హఫీజ్‌పూర్ గుట్టలు, అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీరు బూరుబండ వాగు ద్వారా కొత్త చెరువు, కాముని చెరువు వరకు వచ్చేది. కాగా బూరుబండ వాగుకు అక్కడక్కడ గండ్లు పడడంతో వర్షాకాలంలో నీరు వృథాగా పోవడంతో ప్రస్తుతం వరి పంటలకు నీరు అందని పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. అలాగే పోల్కంపల్లిలో కతాన్ చెరువు ఏరియాలో చాలావరకు వరి చేలు ఎండుముఖం పట్టాయి. వరికుప్పల జంగయ్య, నందికొండ బాల్‌రెడ్డికి చెందిన 9 ఎకరాల మేర, ఆమనగంటి యాదయ్యకు చెందిన నాలుగెకరాల వరి చేను పూర్తిగా ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు. ఇంకా మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో నని రైతులు ఆందోళనలో ఉన్నారు.

పొట్టదశలో ఎండుతున్న పంటలు

చౌదరిగూడ: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్, ఎదిర, చెగిరెడ్డి ఘణాపూర్, జాకారం, పీర్జాపూర్, వీరన్నపేట్, చెన్నారెడ్డిగూడ, తుమ్మలపల్లి, లచ్చంపేట్, గుర్రంపల్లి గ్రామాల్లో వరి పంటలకు నీరందక ఎడుతున్నాయి. బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో పొలాలు నెర్రెలు బారుతున్నాయి. పొట్ట దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి బోర్లు వేస్తున్నా నీరు పడటం లేదు.

ఎండలకు బోర్లు ఎండిపోయాయి



ఎండలకు భూగర్భ జలాలు తగ్గిపోయాయి. బోర్ల నుంచి చుక్క నీరు రావడం లేదు. నీరందక పంటలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్న. రెండున్న ఎకరాల్లో వరి సాగు చేశా. రూ.50వేల వరకు పెట్టుబడి అయ్యింది. పంట వేసినప్పుడు బోరు బాగానే పోసింది. ఎండలు ఎక్కువైనాకొద్దీ నీరు పోయడం తగ్గింది.

- మద్ది సత్తయ్య, ముష్టిపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

మూడున్నరెకరాలు ఎండిపోయింది



యాసంగిలో మూడున్నరెకాల వరి సాగు చేశా. రెండు బోర్లలో ఒకటి నెలకిందటే అడుగంటగా, ఎకరంన్నర పొలం అప్పుడే ఎండిపోయింది. మిగిలిన రెండెకరాలైనా చేతికి వస్తుందేమోనని ఆశపడితే రెండో బోరు కూడా అండుగంటి పూర్తిగా ఎండిపోయింది. అప్పుచేసి రూ.50 వేలదాకా పంట పెట్టుబడి పెట్టా. చివరికి అప్పు మిగిలింది.

- చిట్టె బాషయ్య, రైతు దండుమైలారం

పశువులకు మేతగా వేస్తున్నాం



రెండు బోర్ల కింద మూడెకరాలలో వరి సాగు చేశా. గింజ పాలుపోసుకునే దశలో బోర్లు నీరు పోయడం లేదు. నీరందక పంట ఎండిపోయింది. విధిలేక పశువులకు మేతగా అవుతుందని వరి కోస్తున్నం. పశువులు తాగడానికి కూడా నీరు దొరకవడం లేదు. పక్క రైతు బోరునుంచి తీసుకొస్తున్నాం.

- చిట్టె అయిలయ్య, రైతు, దండుమైలారం

పేదల భూములు తీసుకోవద్దు

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ, ఫ్యూచర్‌సిటీల పేరుతో పేదల భూములు తీసుకోవద్దని, తక్షణమే భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఎం యాచారం మండలం కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. రేపు(గురువారం) మేడిపల్లి నుంచి కలెక్టరేట్ వరకు జరిగే పాదయాత్రను సీపీఎం కేంద్ర నాయకులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీలు ప్రారంభించనున్నారు. ఈ మేరకు బుధవారం కుర్మిద్దలో జరిగిన జీపుజాతను ఆయన ప్రారంభించారు. నర్సింహ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం వేలాది ఎకరాల పట్టా, అస్సైన్డ్ భూములు తీసుకొని వేలాది మంది పేదల బతుకులను బుగ్గిపాలు చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూసేకరణ చేయబోమని.. రైతులను ఆదుకుంటామని మాట ఇచ్చి మళ్లీ భూసేకరణకు పూనుకోవడం ప్రజలను వంచించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు అంజయ్య, పీజేపాల్, విప్లవ్‌కుమార్, కె.జగన్, దంతుక పెద్దయ్య, చందూఆనాయక్ తదితరులున్నారు.

కసిరెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలి

ఆమనగల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నూతన మంత్రి వర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం కోరారు. ఈమేరకు పార్టీ అధిష్టానానికి ఆయన విన్నవించారు. బుధవారం ఆమనగల్లు సత్యం విలేకరులతో మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన విద్యావేత్త కసిరెడ్డికి అపారమైన పాలనానుభవం ఉందన్నారు. దశాబ్దాల కాలంగా ఎన్నో సేవలందిస్తున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారాయణరెడ్డికి అవకాశం కల్పించాలన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

చేవెళ్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్ వ్యసనానికి దూరంగా ఉండాలని బీజేపీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ యువత బెట్టింగ్ వ్యసనానికి గురై అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. విలువైన జీవితాలను నాశనం చేసుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. క్రికెట్ బెట్టింగ్ జోలికి యువత అస్సలు వెళ్లొదన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కేశంపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం పోమాల్‌పల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు హౌసింగ్ ఏఈ కరుణాకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

కడ్తాల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కడ్తాల సీఐ శివప్రసాద్ కోరారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం శాంతి సమావేశం నిర్వహించారు. రంజాన్, ఉగాది నేపథ్యంలో నిర్వహించిన శాంతి సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీఐ శివప్రసాద్ అధ్యక్షత వహించారు. పలు సూచనలు చేశారు. మతపరమైన వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. ఎస్ఐ వరప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరామ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు జహంగీర్‌అలీ, అహ్మద్‌జానీ, రెడ్యనాయక్, భగీరథ్, ఈర్శద్, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

కేశంపేట/మహేశ్వరం : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పంచాయతీ కార్యదర్శి సక్కుబాయికి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, జగన్, విద్యావతి, మల్లేష్, రమేష్, ప్రశాంతి, రమాదేవి, నదీమ్‌లు నివాళులర్పించారు. కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో సక్కుబాయి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. మహేశ్వరం మండల కేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సక్కుబాయి దంపతులకు నివాళులర్పించారు.

తలకొండపల్లి : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీసీసీ కిసాన్ సెల్‌రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఆజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్‌లు అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఎస్సీ సబ్ ప్లాన్‌నిధుల నుంచి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు.

కడ్తాల్ : ప్రజాభీష్టం మేరకు రాష్ట్ర ప్రభుత్వం పథకాలు, పనులు రూపొందించి అమలు చేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని మజీద్ నుంచి స్మశానవాటిక వరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఈజీఎస్ నిదుల నుంచి రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్‌లతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

కందుకూరు : మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చొరవతో మంత్రి శ్రీధర్‌బాబు కొత్తగూడ జీపీలోని కాస్తూర్బాగాంధీ బదిరుల ఉన్నత పాఠశాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు మంజూరు చేసిన నిధులతో పనులు పూర్తయ్యాయి. ప్రిన్సిపాల్ తీగల భార్గవితో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి.సంజీవరెడ్డి, బి.నరేందర్‌రెడ్డి, ఎస్ శేఖర్‌గౌడ్, కె.కృష్ణయ్యలు ప్రారంభించారు.

చేవెళ్ల : ధర్మబిక్షం చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాని గీత పనివాళ్ల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్ తెలిపారు. ధర్మబిక్షం వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు.

యాచారం : రామోజీ ఫిల్మ్‌సిటీలో ఉన్న భూముల్లో పేదలకు ఇంటిస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరితే పోలీసులు అరెస్టు చేయడం దారుణమని సీపీఎం నాయకులు బోడ సామ్యేల్, పి.అంజయ్యలు అన్నారు. ఫిల్మ్‌సిటీలో ఉన్న భూముల్లో ఇళ్లలేని పేదలకు స్థలాలను చూపి పట్టాలు అందించాలని ఆయన అన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కేశంపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 24 గంటలు సరఫరా చేస్తున్నామని కేశంపేట ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి గతంలో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం నుంచి 33 కేవీ విద్యుత్ సరఫరా ఉండేదని తెలిపారు. ఆ సమయంలోనే మండలంలో విద్యుత్ సమస్య రాలేదని వివరించారు. ప్రస్తుతం మండలంలోని అల్వాల 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 33కేవీ వి ద్యుత్ సరఫరా అవుతుందని, ఇప్పడు లో వోల్టేజీ వచ్చే ప్రసక్తే లేదన్నారు. గ్రామాలలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను, కొత్తగా దిమ్మెలు నిర్మించి ఎత్తులో పెడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం వేసవి కావడంతో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఎర్తింగ్‌కు నీటిని వదులుతున్నామన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



కందుకూరు : పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు/యాచారం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పది సంవత్సరాల పాటు సేవలందించిన ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిని బుధవారం నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ కందుకూరు మండలాధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు పల్లె కృష్ణగౌడ్, జిల్లా నాయకులు జిట్ట రాజేందర్‌రెడ్డిలు నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి సన్మానించారు. రాష్ట్ర కమిటీ ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీలో కీలక పదవి ఇవ్వాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ నివాసానికి వెళ్లి సన్మానించారు. నాయకులు పండల శ్రీనివాస్‌గౌడ్, బొక్క సత్యనారాయణరెడ్డి, ఎగ్గిడి సత్తయ్య, జి.ప్రభాకర్, బి.మల్లేష్, కె.బాబుగౌడ్, అంబటి యాదగిరి, ఎస్.భూమిరెడ్డి, తదితరులున్నారు. అలాగే రాజ్‌భూపాల్‌గౌడ్‌ను బీజేపీ యాచారం మండల అధ్యక్ష కార్యదర్శులు తాండ్ర రవీందర్, నడికూడి కృష్ణ, నాయకులు నాగటి యాదయ్య, గొరిగే బీరప్ప, వన్నవాడ రవీందర్‌రెడ్డి, రమేష్ తదితరులు సన్మానించారు.